# మాంగల్య మహిమ

టి. ఎస్. భార్గవి టాగెట్

"నాకేమో మాంగల్యంలో ఏమీ మహత్వం లేదు లక్ష్మీ" అంది హేమలత. ఒళ్ళు అధునాతనస్త్రీలా అలంకరించుకొని, సినీ కోకిలలా క్లబ్బులకీ, సినిమాలకీ తిరిగే హేమలత, మరో ఏడాదిలో తాళి కట్టించుకోబోయే పాతికేళ్ళ నవీనయువతి హేమలత అలా అనడంలో నాకేమీ ఆశ్చర్యం అనిపించలేదు.

"ప్రేమతో బంధింపబడిన యువతీ యువకులు లోకానికి చూపించవలసిన సాక్ష్యంమాత్రమే మాంగల్యం. అదిలేని స్త్రీ తన భర్తను ప్రేమించలేదా?..." ఇలా ఏమేమో చెప్పుకుపోతోంది హేమలత. "ఏమంటావు" అని గట్టిగా అడిగేసరికి ఈ లోకంలో పడ్డాను.

"హేమా! మాంగల్యంయొక్క పవిత్రత నీకు తెలీదు. దాన్ని గురించి నిజంగా జరిగిన ఒక సంఘటన చెప్తాను వింటావా?" అన్నాను.

హేమ వాచ్ కేసి చూసుకుంది "ఇంకా అరగంట టైముంది. ఈరోజు మా క్లబ్బులో దీన్ని గురించే చర్చించబోతున్నాం. నీవు చెప్పేవిషయం నాకేమైనా ఉపయోగపడుతుందేమో చెప్పు" అంది.

నేను చెప్పడం మొదలెట్టాను. "అది ఒక చిన్న గ్రామం. దానిపేరు డక్కు. అది నా స్వగ్రామం. ఆ గ్రామంలో ఓ మూడొందల కుటుంబాలుంటాయేమో. మా యింటికి కొంత దూరంలో ఒక పెద్ద నిద్రగన్నేరు చెట్టుండేది. దానికింద ఒక చిన్న ఇంటిలోనుండి పొద్దుట ఎనిమిదిగంటలనుండి "టక్కు— టక్కు"మని చప్పుడు వినిపిస్తూ ఉండేది. ఆ గుడిసెలో స్వర్ణకంసాలి బంగారయ్య, అతనిభార్య గంగమ్మ, వారి ఒక్కగానొక్క కొడుకు మాణిక్యం ఉండేవారు.

మా ఊరికంతా బంగారయ్య ఒక్కడే కంసాలి. అందువలన అందరూ అతనిదగ్గరే నగలు చేయించేవారు. దానికి రెండు ప్రబలమైన కారణాలుండేవి. ఒకటి—బంగారయ్య మోసము చెయ్యడు. మరొకటి – అతనిదగ్గర చేయించుకున్న మంగళసూత్రంయొక్క బలం గొప్పదని, ఆ మాంగల్యం ధరించిన స్త్రీ దీర్ఘకాలం సుమంగళిగా ఉంటుందని ప్రతీతి. ఏ కారణంవల్లనైతేనేం బంగారయ్య కెప్పుడూ చేతినిండా పని ఉండేది.

బంగారయ్య కొడుకు మాణిక్యాన్ని ముద్దుగా "ముత్యూ" అని పిలిచేవాడు. కాని వాడు మాణిక్యమూ కాలేదు, ముత్యమూ కాలేదు. చెడుగుణాలన్నీ కరగించి పోసిన విగ్రహంగా తయారయ్యాడు. ఈ కొడుకును తలచుకొని కుమిలిపోయేవారు బంగారయ్య దంపతులు. అంత మంచి పుణ్యదంపతుల కడుపులో ఇలాంటివాడెలా పుట్టాడా అని ఆశ్చర్యపోయేవారు ఊరివాళ్ళందరు. మాణిక్యాన్ని మంచి దోవను తీసుకురావాలని అందరూ ఎంతో ప్రయత్నించారు, కాని లాభం లేకపోయింది.

ఒకనాడు రాత్రి ఒంటిగంటకు తాగి వచ్చిన మాణిక్యాన్ని చూచి బంగారయ్య కోపం రెచ్చిపోయింది. కోటికొచ్చినట్లుగా తిట్టాడు. అంతే మరునాటిరోజు ఉదయానికల్లా వకీలుగారికని చేసిపెట్టిన రెండు బంగారు గాజులతో మాయమయ్యాడు మాణిక్యం. గంగమ్మ శోకానికి మితిలేకుండా పోయింది. బంగారయ్య కూడా చివరికాలంలో కొడుకు దగ్గరలేకుండా పోయాడే అని విచారించినా గంగమ్మలాగా బైటపడలేదు. తన భార్య గాజుల్ని వకీలుగారికిచ్చివేశాడు.

మూడు సంవత్సరాలు గడిచాయి. ఒకనాడు హఠాత్తుగా ఎక్కడినుండో ఊడిపడ్డాడు మాణిక్యం. కాని మూడు సంవత్సరాల క్రితం వెళ్ళిపోయిన మాణిక్యానికి ఈ మాణిక్యానికి ఎంతో తేడా ఉంది. పిలక తీయించేసి క్రాఫు పెంచాడు. పంచె బదులుగా పైజామా, చేతిలో సిగరెట్టుతో ప్రత్యక్షమయిన మాణిక్యాన్ని చూసి బంగారయ్య అసహ్యించుకొన్నా, పైకి ఏమీ అనలేదు. అంటే మళ్ళీ ఎక్కడ పారిపోతాడో అన్న భయంచేత. ఏదో థర్డుఫారం వరకు చదువుకున్నాడుగదా ఏదైనా ఉద్యోగం చేస్తావా అని అడిగాడు. మాణిక్యం మౌనం వహించడంచేత మళ్ళీ ఆ విషయాన్ని కదపలేదు. రోజూ పక్కనున్న పట్నానికెళ్ళడం సినిమాలు చూడ్డం అలవాటు అయింది. గంగమ్మను వేధించి డబ్బులు గుంజేవాడు. మళ్ళీ ఎక్కడ పారిపోతాడోనన్న భయంచేత భర్తక్కూడా తెలియకుండా డబ్బు లిస్తూవచ్చింది గంగమ్మ.

ఒకనాడు గంగమ్మ భర్తతో "ఏమండీ, మీరింతమందికి మాంగల్యాలుచేసి వారి జీవితాలు నిలబెడుతున్నారే మన అబ్బాయికి ఒక పెళ్ళంటూచేస్తే బాగుపడతాడేమో ఒక మంగళసూత్రం తయారుచేయండి" అంది. అలాగే అని ఒక మంగళసూత్రం ఎంతో శ్రద్ధతో, ఉత్సాహంతో తయారుచేశాడు. ఒకనాడు పెళ్ళివిషయం కొడుకుదగ్గర కదిపాడు. "మాణిక్యం! నీవు పెళ్ళిచేసుకొని కాపురం చేస్తుంటే చూడాలని ఉందిరా. ఏదో మేమూ ముసలివాళ్ళ మయ్యాము. నీ ముద్దూ ముచ్చటా చూడాలని ఉందిరా" అన్నాడు బంగారయ్య. గంగమ్మ ఆశగా కొడుకువంక చూసింది.

దీనికి ససేమిరా ఒప్పుకోనన్నాడు మాణిక్యం. కారణం ప్రక్క గ్రామంలోని వాసంతి అనే వేశ్యయొక్క స్నేహం. పెళ్ళి చేసుకుంటే తను ఇష్టపడి గడిపే "జాలీ లైఫ్"కు ఆటంకం కలుగుతుందని భయపడ్డాడు. "నీకోసం ఎంతో కష్టపడి మాంగల్యం కూడా తయారుచేశారురా మీ నాన్న. మా ఆశలు వమ్ము చేయకురా," అంది గంగమ్మ. గంగమ్మ మాటల్లో మాంగల్యం తయారుచేశారనేది మాత్రం స్పష్టంగా వినిపించింది. పెళ్ళి చేసుకున్నా చేసుకోకపోయినా ఆ మాంగల్యం నాకోసం తయారుచేసింది. దాన్ని తీసుకోవడంలో తప్పులేదని ఆ రాత్రి దాన్ని తస్కరించి వాసంతిదగ్గరకు పరుగెత్తాడు.

"వాసంతీ, వాసంతీ"— అని పిలిచాడు. మాణిక్యం గొంతు గుర్తించింది వాసంతి. "నిన్ననేగా వచ్చావు మళ్ళీ వచ్చావెందుకు" అంది తలుపు తీయకుండానే.

"నిన్నటిలాగ వట్టిచేతుల్తో రాలేదు. నీకో బహుమతి కూడా తెచ్చాను."




తలుపు తీసింది వాసంతి. చేతిలోని మాంగల్యాన్ని వాసంతి ముందుగా చాచాడు మాణిక్యం. వాసంతి నోట మాట రాలేదు. 'ఏం వాసంతీ, అలా చూస్తున్నావు" అన్నాడు.

"ఇది ఎవరి మెడలోది? కటువుగా ప్రశ్నించింది వాసంతి. మాణిక్యం గట్టిగా నవ్వాడు." ఇది దొంగసొమ్మనుకున్నావా? కాదు మా నాన్న నా పెళ్ళికోసం తయారు చేసింది. ఇది నాదే," అన్నాడు.

"ఆ! మీ నాన్న చేసిందా? అయితే నీవు – నీవు బంగారయ్య కొడుకువా?" అవును అన్నాడు మాణిక్యం.

"ఆ, నీవు బంగారయ్యకొడుకువేనా. ఇది వారుచేసిన మాంగల్యమేనా? దీన్ని చూడగానే అనుకున్నాను. ఆ పుణ్యాత్ముడు చేసిన మాంగల్యానికి మాత్రమే యింత అందము, ప్రకాశము ఉంటుంది. ఆ ఉత్తముని కొడుకువా నీవు? నాకు యింతవరకూ తెలియలేదే? మాణిక్యం ఈ మాంగల్యంయొక్క పవిత్రత నీకు తెలుసా" ఈ ఆభరణము ఎంత మహిమగలదో తెలుసా? దీనితో తులతూగే శక్తి మరి దేనికీ లేదు స్త్రీలకు దీనికంటె ముఖ్యమైన దింకేదిలేదు. ఆ పుణ్యాత్ముడు చేసిన మాంగల్యంయొక్క మహిమవల్ల ఎంతమంది సుఖంగా కాపురాలు చేసుకొంటున్నారో తెలుసా? నేనూ అలాగే ఉండాలనుకున్నాను, కాని నాకు ఆ అదృష్టములేక యిలా మారిపోయాను. అటువంటి ఉత్తముని కొడుకుకు మాంగల్యంయొక్క మహిమ తెలియలేదే! ఛీ ఫో. వెంటనే వెళ్ళి మీ నాన్నగారి ఆశ నెరవేర్చు. ఇంకెప్పుడూ యిక్కడకు రాకు" అని ధభాలున తలుపు మూసేసింది.

నిశ్చేష్టు డయ్యాడు మాణిక్యం. ఒక వేశ్యకు మాంగల్యాన్నిగురించి యింత తెలుసా అని ఆశ్చర్యపోయాడు.

'అయితే నేను చేసింది తప్పా?' మాణిక్యం మనస్సులో పెద్దతుఫాను వీచింది. గబగబా యింటికొచ్చి తండ్రి కాళ్ళమీద పడ్డాడు..

మరునటినెలలో మాణిక్యంపెళ్ళి వైభవంగా జరిగింది. హుమ్! ఇప్పటికీ ఆ గుడిసెలోనుండి టక్కు టక్కుమని చప్పుడు వినిపిస్తూ ఉంటుంది కాని ఆచప్పుడు ఒకరు చేసేది కాదు. బంగారయ్య, మాణిక్యం యిద్దరూ కలిసి చేసేదప్పుడు" హేమ కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

ఇంతలో మాఅమ్మ "భార్గవీ" అని పిలిస్తే చేతిలోని పుస్తకాన్ని మూసి మాంగల్యంకధనుగురించి ఆలోచిస్తూ లోపలికెళ్ళను.

★

(ఒక తమిళకథ ఆధారంగా)

